పెద్ద కథ

# ప్రత్యర్థులు



అల్లం రాజయ్య

గత సంచిక తరువాయి

లోపలి స్థితి పూర్తిగా మారిపోయింది... ముఖం ఎప్పటిలాగా శిలాసదృశం కావడానికి సిద్ధపడుతోంది. నడుస్తున్నాడు. నడుస్తున్నాడు. పటాలం వెంట నడుస్తోంది. వెనుక భక్తుల సందోహం పెరిగింది. స్తంభించిన గుడి కార్యకలాపాలు తిరిగి పుంజుకునే ఏర్పాట్లు - ఎడంవేపు దర్శనంకోసం నిలుచున్న వేలాది భక్తుల బృందాలు - బృందాలు బృందాలు...

పద్మావతి గెస్టవుజు ముందునుండి రెడ్డి బృందం గౌరవ సూచకంగా లేచి నిలబడి ఎదురొచ్చారు. కాని ఆ నడక తీరు గుండా పద్ధతే... కొట్లాటలు, గొడవలు నీకేం తెలుసు - వుల్లేయడం తెలుసు గాని - అనే చూపు... బాంబుల వాసనేస్తోందా? గంధకం వాసన -

కాశయ్యను పక్కకు పి·మ్మన్నాడు.

"మీకు రాంగ్ న్యూజుఫీడయ్యింది" రెడ్డి నిర్లక్ష్యంగా -

"రెడ్డీ - వాళ్ళు బిజినెస్ ప్యూపుల్ - బాంబే బిజినెస్‌వాళ్లు జిత్తుల మారోల్లు - ఆ తరువాత నీయిష్టం?" అన్నాడు సాధ్యమైనంత నెమ్మదిగా -

అంటే ఏమిటో రెడ్డికి అర్థమయ్యింది. రాయలసీమకు స్పెషలాఫీసర్ వొస్తాడు పైనుంచి రైడింగులు జరుగుతాయి. కేసులు మూసేయబడాలి. తన ప్రత్యర్థులకు ఏ అడ్డంకి లేకుండా ఆయుధాలు అందుతాయి... అయినా ఉండో ఊస్తడో? వాళ్లు మానేజ్ చేసుకుంటే ఎందుకైనా మంచిది.

"వాళ్లే కబురు పంపారు?"

"వాళ్లకది అవసరం. వాళ్ల వెనుకనున్నవాళ్ల కవసరం. నీది నువ్వు చూసుకోవాలె గద".

"మేము ఎన్నేండ్ల నుండో మీతోడ ఉంటన్నం. అయినా మామీద మీకు నమ్మకం లేక - మహారాష్ట్రలో వేస్తిరి నామినేషన్. ఎవరేమన్న - డమ్ము సంచులొచ్చిన - రెడ్డి పుటక పుట్టి మాటతప్పం. మీరు నిర్భయంగా ఉండొచ్చు... చూస్తరుగద మా నిజాయితీ. మీకు లక్ష ఓట్ల మెజారిటీ..."

"రెండు ప్రాంతాలు, కోస్త, తెలంగాణా ఒదిలి - మీమీద నమ్మకంతోనే గదా? రెడ్డీ మీరు ప్రాణమైన యిస్తారు. ప్రాణమైనా తీస్తారు... నాకు నమ్మకమే -" భుజంమీద చెయ్యేసి నొక్కాడు...

రెడ్డి నామోషీ ఫీలవకుండా - తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ... మరేమీ మాట్లాడకుండా ఒక్కటొక్కటే మెట్లెక్కి లోపలికి నడిచాడు.

** ** **

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. వంట బ్రాహ్మడు యిచ్చిన రెండు పులకాలు తిన్నడు.

అటుయిటు పచారు చేస్తూ దేని గురించి ఆలోచించకూడదనుకున్నాడు. పోనీయ్. పోతే పోనీయ్. సుతుల్ - హితుల్ - రానీయ్ కష్టాలు నష్టాలు... జ్ఞాపకాలు పోనీయ్. తనెందుకు ఆ జ్ఞాపకాల చుట్టు తిరగాలి.... యస్ తను ఒంటరివాడు అయితేమిటి? కాలంతోపాటు - అస్థిత్వంలో వున్న అన్ని వక్తుల కదలికను అర్థం చేసుకున్నాడు. అందుకే మెట్లు మెట్లుగా ఇక్కడ దాకా వచ్చాడు. మనిషికి కొండ పాదంలో వున్నప్పడు కొండ శిఖరం దాకా ఎగబాకాలనిస్తుంది. తీరా శిఖరం మీదికి చేరుకున్న తరువాత పైన శూన్య ఆకాశం. కింద అన్నీ -

కరమ్‌సింగ్ - అర్జున్‌దాస్, జువార్ దివాన్ - పాయ్...

పాయ్ ప్రధాన మంత్రి ఔతాడా? ఔతే. కానీయ్. బాంబే బిజినెస్‌మెన్ ఆడే ఆట - లోలోపల. చట్వానీ, జోషీ అమెరికా - థాకరే.. జపాన్, జర్మనీ, ఇంగ్లండు - కలెగూరగంప - దేశం - ప్రజలు - మార్కెట్లు - అమ్మడం -కొనడం - లాభం నష్టం - గ్లోబలైజేషన్ - లిబరలైజేషన్ - తెరువు తలువులు తెరువు. కిటికీలు ఊడబెరుకు.

పాయ్ ముఖం.. తన ముఖానికి, ఆ ముఖానికి ఏమిటి తేడా? అతని ముఖం అర్బన్, తనది రూరల్. ఈ తేడాలు కూడానా? భోపాల్‌లో పుట్టి... పెళ్లిపెటాకులు లేకుండా? అదే సుఖమేనేమొ? తను పెళ్లి, పిల్లలు ఆ... ఏది అంటకుండా - పాయ్ పుస్తకావిష్కరణ సభ ఇటీవల జరిగింది గుర్తొచ్చింది. తనను - లతను పిలువాలా? వాళ్లిద్దరు బ్రహ్మచారి, చారిణిలు - తను వాళ్ల... పాయ్ కన్నీళ్లు పెట్టుకున్నాడు. సుదీర్ఘ ఒంటరి

# మూడో భాగం

యానం తర్వాత తను నాలాగే ఆలోచిస్తున్నాడా? తనకు కన్నీళ్లు రావు. కన్నీళ్లు ఇంకిపోయాయి. కన్నీళ్లింకిపోవడం ఎక్కడ ప్రారంభమయ్యింది? సకల ఎమోషన్సను మళ్లీ శ్మశానాలు తవ్వుతున్నానా? వొద్దు.. వొద్దు –

బయట తిరిగొస్తే బావుండును. శిలాజాలను, ఆకాశగంగను – చూసొస్తే బావుండను. వీల్లేదు. ఈ గదిలోనుంచి కదలడానికి వీల్లేదు. తను కదిలితే గార్డ్సు కదులాలి...

గదిలో అటిటు చూశాడు... టేబుల్ మీద టి.వి. – వి.సి.ఆర్. అమర్చి ఉన్నాయి. తను మర్చే పోయాడు. తను చెప్పాడు కదూ. బతికిపోయాం. ఈ చిక్కురుబొక్కురు రాత్రిలో –

వి.సి.ఆర్. మీట నొక్కాడు.

రాజేంద్రప్రసాద్ మాయలోడు సినిమా నడుస్తోంది.

"ఒక అమ్మగాని ఒక అయ్యగాని" రాజేంద్రప్రసాద్ ఏదో అంటున్నాడు.

ఒక చిన్నపిల్ల వైద్యంకోసం కనికట్టు – గారడివిద్యలు చేస్తున్నాడు. ఊరకనే వెకవెకనవ్వాడు. తన నవ్వు తనకే చిత్రమనిపించింది. పెదిమలు విచ్చుకోకుండా లాంఛనంగా, ఒకరకం కుట్ర నవ్వు తప్ప – ఇలాంటి నవ్వు తనెరుగడు. ఇవ్వాడెందుకిట్లా? సహజంగా ఏ ఉద్వేగం బయటకు పోకపోతే అసహజంగా బయటకు వస్తుదంట.

రావు పార్వతిని అన్నింటిని ధిక్కరించి పెండ్లి చేసుకున్నప్పుడు బ్రహ్మచారి పాయ్ వెళ్లి అందరికన్నా ముందు అభినందించాడు... అన్నిట్లో తిరుగుతో – అన్ని బంధనాల్లో ఉంటో లేదనుకోవడం. బ్రహ్మచారి శిక్షా? వరమా? నియమాలు ఎవరు విధిస్తారు? దోస్తో విస్కీ "నేరము నియమాలు మన రక్తంలో ఇంకిపోయి ఉంటాయని" నియమాలను తనకు తానే విధించుకున్నాడా? లేదు... అందులో తర్ఫీదు చేయబడ్డాడా? తన బతుకంతా తన లోపలి నియమాలు – బాహిర్ అరాచకత్వానికి మధ్యన జరిగిన సంకుల సమరమే... గాయం కన్పించదు. శబ్దం విన్పించదు. విసుగు విరామం లేని దీర్ఘ కాలిక యుద్ధం... అంటే తను లెనినిస్టులు చెప్పే దర్ఘకాలిక యుద్ధాన్ని ఒప్పుకుంటున్నట్టా? లేదు. లేదు. ఆ గీత కావలవేపున వాళ్లు, ఈవలి వేపున తను.

తను పల్లెలో మట్టిలో – తోటి మనుషులతో కలిసిపోతే మట్టిలో మన్నై – మబ్బులో మబ్బైతే – ఊరందరి చరిత్రే తన చరిత్ర – వాన చినుకై – వడగాడ్పు – తను కవిత్వం రాయగలడు. ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోతున్నప్పుడు అసెంబ్లీలోనే సుదీర్ఘ కవితను చదివాడు... కాని సంతోషంగా ఉండే దేశానికి చరిత్ర లేనట్టే సుఖపడ్డ మనిషికి చరిత్ర లేదంటారు. సుఖపడ్డవారి చరిత్రలన్నీ ఒకటేనట – కాని కష్టపడ్డ వారి చరిత్ర వేరంటాడు టోల్‌స్టాయ్. తన కుటుంబం – ఊరి మనుషులతో తనను కలువనియ్యలేదు. తనను కింది మనుషులు ఎంత వేడుకున్నా కలువనియ్యలేదు. ఎవరిని వినపడని – కనపడని – భయంకర పరాయీకరణ యిది. ఆ సంక్షోభం లోంచి – ఆ చీకటి రాత్రుల వెక్కి వెక్కి ఏడ్పుల్లోనే తన వివాహం జరిగింది....

మిస్టర్ రాజేంద్రప్రసాద్ మాయలోడు – అప్పుడు నాకు తొమ్మిదేండ్లు...

టీవీ తెరమీద రాజేంద్రప్రసాద్ విన్పించుకోలేదు. అతని గోల అతనిది. అయినా పట్టించుకోకుండా.

భాజభజంత్రీలు – అట్టహాసం. తొమ్మిది రోజులు విందులు వినోదాలు. ఆ ప్రాంతంలో అట్లాంటి పెళ్లి జరుగలేదు... ఆ అట్టహాసం – ఆ అందరికన్నా గొప్ప అని తను ... అప్పటినుండి శిక్షణ మొదలయ్యింది...

రైతు తన కొడుకును మట్టితో మర్దనచేసి – లేత రెక్కలకు మొక్కల చిగురాకుల లేపనం పూసి పెంచుతాడు. పొలాలే అతని పాఠశాల పక్షిలాగా, జంతువులాగా వాడు ప్రకృతిలోంచి ఎదుగుతాడు. కాని తనను వాటిమీది అధికారిగా, పాలితుడిగా పెంచారు. తన శరీరం మట్టిలోంచి, గాలిలోంచి, చెమటల్లోంచి చిగురాకుల్లోంచి కాకుండా – ఇతరులు సృష్టించిన సంపదలోంచి ఫంగస్‌లాగా ఎగిరింది.... యస్ ఫంగస్...

భార్య ముఖంతోపాటు – అసంబద్ధ, అనంత సంఘర్షణలు. పోటెత్తాయి... విట్టూర్పు...


పాయ్ పుస్తకావిష్కరణ సభలో – లత వనికే గొంతుతో పాడింది. లత గొంతు గొంతులోంచి ఒక రక్తనాళాన్ని పెరిగి వాయించినట్టుగా ... ఆ గొంతు అట్లా మోగుతుండగానే ఆమె కళ్ల వెంట నీటి ధారలు. వేదిక మీద – ముగ్గురమే. ముగ్గురం ఒకే ముఖంలాగా – ఒకే మనిషిలాగా – కారణాలు ఏవైనాకాని – ప్రయాణం ఎక్కడ మొదలయ్యింది? నడిచి నడిచి – పరుగెత్తి పరుగెత్తి – చీరుకుపోయి – ఓడిపోయి గెలిచి – ఓడిపోయి – చివరకు అట్లా ముగ్గురం ఒకేవేదికమీదికి చేరడం వింతకదా! లత మూడుకోట్ల పాలరాతి మందిరంలో 'వైట్ హేర్డ్ గర్ల్'... పాలిపోయిన ఆ మూగ గొంతు విప్పి... తన నాదులు అలల్లాడుతూ వుండగా, తనకన్నా లత అదృష్టవంతురాలేమొ... విశాదంగానైనా పాడగలదు. కనీసం ఏడ్వగలదు. సమస్త ప్రపంచాన్ని ఏడ్పించగలదు... ఒక శోకతప్త ఆర్తనాదం లత.

**  **  **

మాయలోడు సినిమాలోంచి, రాజేంద్రప్రసాద్ ఉల్టా మాటల్లోంచి – తనకు నవ్వు రావడం లేదు... మనసు మళ్లీ చెదిరిపోయింది.

అతని ఊళ్లోగల ముప్పై గదుల పాతకాలపు దేవిడీలో తచ్చాడుతోంది... పెళ్లేమిటో సంసారమేమిటో? అర్ధంకాకుండానే బిడ్డలు పుట్టారు.... హన్మకొండ మల్టీపర్పస్‌లో చదువు. ఇంగ్లీషులో స్టేట్ ఫస్టు – పరాయి భాషలో పస్టు – అప్పుడు తను పొంగిపోయాడా? కొన్ని వేలమందిలోంచి తను. లోపలి అహం పడగ – మనిషి లోపల వేయి పడగలుంటాయేమొ?

అట్లా పంట పొలాల్లోంచి పుస్తకాల్లోకి నెట్టబడి అందులోనే తలపెట్టి – లాయర్ చదువుకోసం నాగపూర్... మహారాష్ట్రలో అప్పుడు తిలక్ పేరు మారుమోగిపోతోంది... బహుశా ఇలాంటి వాళ్లందరికి సరిపోయే కార్యక్రమం యిచ్చాడా? ఔను చరిత్ర నుంచి సమకాలీన పరిస్థితుల నుంచి ప్రత్యర్థులిద్దరు రూపొంది యుద్ధంలో మోహరించి – తను అందులోకి యిష్టపూర్వకంగా వెళ్లాడా? అయితే "ఆర్యసమాజ్ ఉద్యమంలో ఎందుకు పాల్గొనలేదు". ఇక్కడెక్కడో ఉంది. తనకు వేన వేల మనుషుల గొంతుక కలిసిన ఉద్యమాలంటే పడదు. అందులో కూడా తన కుబుసాన్ని విడిచి గొంతు చించుకుని అరవలేదు. పిడికిలెత్తలేదు...



తన ఊళ్ళో మనుషులు తమకు కావాల్సిన ఉద్య మాలు నిర్మించుకుంటే – తను తనకు కావాల్సిన దాన్ని వెతుక్కున్నాడు.

తన లాయర్ చదువయిపోయింది. తిలక్ ఉద్యమాలతో తనకు ఆమాత్రం తెగిపోయింది.

మళ్ళీ ఊళ్ళోకి వచ్చాడు. ఏం చేయాలి? ఎక్కడ నిలబడాలి? ఆకాశం కప్పకింద ఇంత విశా లమైన భూభాగం మీద– పదిహేను వందల ఎకరాల జమీనుకు వారసుడై కూడా ఒంటరై తను వ్యవసాయం చేయించాలనుకున్నాడు.. వ్యవ సాయం ఎందుకు చేయాలనుకున్నాడు? ఎక్కడ వేరుపడ్డాడో? ఎక్కడ హర్టయ్యాడో అక్కడే నిలబడాలని– ఆ పూరి మట్టిలో– గాలిలో– పంటల్లో, మనుషుల్లో కలవాలనే వాంఛ– అది కాదేమో! అంతమంది కలిసున్నప్పుడు తననెందుకు కలుపుకోరు... తను ఆవలి పక్షంవాడు.

మూడేండ్లా? నాలుగేండ్లా? ఆ భూముల చుట్టూ విఫల మనోరథునిలాగా– అందమైన, అపురూపమైన యువతి చుట్టూ ఆణాకాణీ బిచ్చ గాడిలా తిరిగాడు.. పాలేర్లు, కూలీలు తన భూముల్లోనే పనిచేసేవారు. కాని తనకేమిటో వాళ్ళ మర్మం తెలిసేది కాదు. ఇప్పుడు తన చుట్టూ మనుషులున్నట్టుగానే– అప్పుడూ వుండేవారు. తను కలువలేకపోయాడా? వాళ్ళు కలుపుకోదలచుకో లేదా? పంటలు సరిగా పండవు. నీటి వనరులు సరిగా లేని గ్రెరె నేలలు. తనకు ఆ నేల లొంగ లేదు. ఈ ఒత్తిడిలో పిల్లలు.. వ్యవసాయంలో ఘోర వైఫల్యమే.

ఊరు ఊరంతా కమ్యూనిస్టుల నాయకత్వం కిందికి వచ్చింది. తను ఊరికి జమిందారు. తన భూముల్లో వున్న గుట్టబోర్ల మీద ఊరికే కాసిన సీతాఫలాలు తెంపినందుకు వీపులమీద రాళ్లెత్తించి చర్మం చిట్లేదాకా కొట్టించే జమిందారీ దర్పం– క్రూరత్వం.. లోలోపల ఊరుతో కలవాలని తాపత్రయం. కాని అర్ధాకలితో పొలాల్లో కూలీలు పనిచేసేవాళ్లు. వాళ్లకు సరైన కూలీ ఇవ్వలేదు.. యుద్ధం తీవ్రమైంది లోపల బయట. ఒకే ఒకరలో ఇమడని కత్తులు దూసుకోవాల్సి వచ్చింది...

గడిమీద దాడి– తిట్లు, శాపనార్థాలు.. ఊరు రణరంగమయ్యింది. తను బర్మారు తెచ్చుకు న్నాడు. ఊళ్ళోకి బందూకులొచ్చాయి. ఎర్ర జండా లొచ్చాయి. పని పాటలు బందు, పాలేరు బందు...

ఊళ్ళఓ వుండలేని పరిస్థితులు– మళ్లీ తనే ఓడి పోయాడు. చిన్నప్పటి తన ఓటమి తనకు మాత్రమే తెలిసింది. కాని ఇప్పుడు పారిపోవాలి... ఊరి జనం తనను తరుముతున్నారు.

ఆ రాత్రి తను ఊరు విడిచి పారిపోయిన రాత్రి– వ్యవసాయంలో, జీవితంలో విఫలమై–

బయట హన్మకొండనుంచి తెచ్చుకున్న జీబు నిలబడి వుంది.

అప్పటికే తన పెంపకపు తండ్రివాళ్ళు వెళ్ళిపో యారు.

చుట్టూ చిన్నపిల్లలను పెట్టుకుని "మీ మనసులో ఏముందో ఎప్పుడూ చెప్పరైతిరి" వెక్కి వెక్కి ఏడుస్తూ భార్య..

బయట నిశ్శబ్దం... వర్షాకాలపు తొలిరోజులు.. తను మేడమీదికి నడిచాడు. పాత లా పుస్తకాల గది... మబ్బులు కమ్మిన ఆకాశం. తనలాగే– తన మనసులో ఏముంది? తనకు తెలుసా? అదేమిటో చెప్పవస్తదా? చెప్తితే అర్ధమవుతుందా? ఈ యుద్ధం అతి పురాతనమైందని చెప్పగలడా? ఈ ఇల్లు– ఊరు.. పడమర గుట్ట బోర్లు– కను చూపు మేరదాకా విస్తరించిన పంటభూములు– పశువులు– ఎద్లు– గొడ్లు– నౌకర్లు, చాకర్లు, నంకర్లు 'నీ బాంచెన్‌దొరా!' అన్న మనుషులే ఊపి రాడనట్టు– తరుమబడ్డప్పుడు పరిచితమైన రక్తంలో కలిసిపోయిన ప్రాంతాన్ని, స్థలాన్ని ఒదిలిపోవడమ నేది చెప్పరాదు. అది ఎప్పుడు తీరనిది–

పోనీ తను ఊరివాళ్లకు చెప్పేటియి చాలా వున్నాయి. వాళ్ళు చెప్పనిస్తారా? తను చెప్పేదెవరికి కావాలి...

అతి చిన్నతనంలోనే కన్నతల్లినుంచి, తండ్రి నుంచి, పుట్టిన ఊరునుంచి నుంచి లాక్కురాబ డ్డాడు అదొక హింస– ఇక్కడ తన ఊరనుకుంటే పెరిగిన ఊరు తరిమేస్తోంది. ఇది రెండో ప్రస్థానం... చెప్తితే తనకు అర్థమౌతుందేమో? తను పుట్టినింటిని ఒదిలిపెట్టి వచ్చిందే గదా!

తను తన ఊరివాళ్లకు కావాల్సింది చెప్పలేదు. తనకు తెల్సింది వాళ్లకక్కరలేదు. వాళ్లకే వాళ్ల గురించి నాకన్న ఎక్కువ తెలుసు. పైగా తన తెలివి... అప్పటికే తనకు మరాఠీ భాష వచ్చు. ఇంగ్లీషు, హిందీ, స్పానిష్– భాషలు వచ్చు వాళ్ళ కెందుకు. ఆ మట్టి బిడ్డదు కాదు ఎంత విశాదం? వాళ్ళకు కమ్యూనిస్టులు అన్నీ అన్ని చెప్తతారు. తను ఎటు పోవాలి?

ఎవరో వచ్చి చెప్పారు... అందరు జీబులో కూచున్నారని–


మసక చీకటి– తూలుతూ మెట్లు దిగాడు... ఎక్కడో పెకలించిన నొప్పి... ఆ తరువాత ఎంత గుర్తుతెచ్చుకున్న ఏదీ గుర్తుకురావడం లేదు.

హైదరాబాదుకు మకాం మారింది. లాయరు ప్రాక్టీసు.

తను అందులో రాణించలేదు... గడగడ, గబ గబ తను వాగలేదు. మాటలెక్కడో తెగిపోతాయి. తన ముఖం చూస్తే ఎవడికి కేసు గెలుస్తాననే భరోసా కన్పించలేదు. సంవత్సరం తిరిగే లోపల మళ్ళీ లోపల ఏదో బుసబుస పొంగింది. వకాలతు ఒదిలిపెట్టేదాకా మాట–

రామనందతీర్థ– కాంగ్రెసు పార్టీ.. వ్యవ సాయం కుప్పకూలిన దగ్గరనుంచి మాట్లాడని మాట లన్నీ పోటెత్తాయి. పిచ్చిపట్టినట్టు ఉపన్యాసాలు– కాంగ్రెసు పార్టీలో తిరగడం... అసంబద్ధ పూన కంలాటిది. ఎవరిమీదనో కోపంతో ఊగిపోతూ... ఉపన్యాసాలు.. వెనక్కి తిరిగి చూడకుండా– చాందా బార్డర్‌లో కాంగ్రెసు శిబిరం– నాయకు డయ్యాడు. తమ ఊరు తాలూకా కమ్యూనిస్టుల పోరాటాలతో గెరిల్లా దళాలతో నిండిపోయింది. నైజాం ఊచకోత, రజాకార్లు– కేసులు... చిత్రంగా తను అదే మానసిక స్థితిలో కాని... తను ఊరి వాళ్లతో కాదు. బార్డర్‌మీద, కాలం సందర్భం మనుషులను రెండువేపుల అలర్ట్ చేస్తుందేమో!

రాజేంద్రప్రసాద్ సినిమా అయిపోయింది. ఎక్కడో తెగిపోయింది. హఠాత్తుగా మాటలు ఆగిపోవడంతో తనకు తెలిసింది– ఇవ్వన్నీ ఇప్పడే ఎందుకు తవ్వి పోసుకుంటున్నట్టు– ఇప్పుడు మరో మలుపు తిరగబోతున్నదా? తనకు సిక్స్ సెన్స్ చెప్తతోంది... ఎన్ని మలుపులు? తనకు ఇవ్వన్ని ఎందుకు గుర్తుండాలి. గుర్తుండి పలపాలి వుందు లాగా!



ఏదో... గొంతులో గురగురలాడుతోంది. ఎవరో మౌనంగా నిలుచున్నారు పక్కనే. నన్ను కావలించుకుని ముద్దుపెట్టుకుని నాన్నా! అంటే... అమ్మా అమ్మా నన్ను నీ ఒళ్ళోకి తీసుకోవా? నాన్నా నన్నెత్తుకోవా? నిన్నెవరు ఆదుకోనియ్యలేదు తండ్రీ... దూయలోడు సినిమాలోని ఆ చిన్నపిల్లలాటివాడేనా తను.

తను మాత్రం ఎవరిని దగ్గరికి తీశాడు. ఎనిమిదిమంది పిల్లలను తను ముట్టుకోలేదు. తనకు ఎవరినైనా తమకంతో, ప్రేమతో, అడ్మిరేషన్‌తో ముట్టుకోవడం తెలియదు. సమస్త శక్తులతో మనిషిని లాలించడం– చేరుకోవడం తనకు తెలియనే తెలియదు.

తన పక్కనే ఎవరో నిలుచున్నట్టు భ్రమా! ఏమి జ్ఞాపకం– ఏదో బరువు... ఆ కళ్లు– అవే కళ్ళు, ఊరిపిల్లల కళ్లు.. తన ప్రియురాళ్ళు.. వాళ్ళను తన్ప్రేమించనే లేదు. ఏదో గొంతు కడ్డంపడుతోంది....

ఆ గదిలో ఆ స్థితిలో ఊపిరాడలేదు. ఆ గదిలో వుండలేకపోయాడు. తనకు తెలియకుండానే గది బయటకు వచ్చాడు. బయట ధవళ వస్త్రం కప్పినట్టుగా వెన్నెల. ఆకాశం మబ్బు, మాయా లేక తేటగా వుంది. తనకంతా తెలుసన్నట్టుగా చంద్రుడు. దేవాలయంలో కోలాహలం తగ్గింది. తనలోపల అదో రొద– ఎవరో వెక్కి వెక్కి ఏడ్చినట్టు– కొన్ని శబ్దాలు, వాసనలు బతుకు పొడుగూతా వెంటాడుతాయి.


కొండలమీద వెన్నెల ప్రవహిస్తోంది. లోయలలో జారుతోంది. ఎం తమహాద్భుతంగా వుంది. తనకు మనసులతోనేం పని? ప్రకృతితో– భగవంతునిలో లీనం కాక– కాని భగభగలాడే మంట చల్లారకుండా– తను ఇలాంటి స్వచ్ఛమైన వెన్నెల చూడక ఎన్నాళ్ళయ్యిందో?

నడుస్తున్నాడు– నడుస్తున్నాడు– మౌనంగా చెట్లు– అన్ని చెట్ల పూల వాసన కలిసి– చిత్రమైన వాసన– ఊళ్ళో మేడమీద వెన్నెల– తన గుండె కొట్టుకోవడం తనకే విన్పించే... ఓహో.. చిమ్మెట్లు పలుకుతున్నాయి... తోట బాగా వృద్ధి చేశారు.

ఒక్కసారి చేతులు వెనక్కి పెట్టుకుని నాలుగు దిక్కులా కలియజూశాడు. తన చుట్టూ స్టెన్‌గన్‌లతో గార్డ్స్... తను ఘరానా ఖైదీలాగా–

చల్లగా హాయిగా గాలి తోలుతోంది. కుడిపక్క కొంచెం కిందికి దిగి గడ్డిమీద కూలబడి– గార్డ్సు పరుగెత్తుకొచ్చారు. తను ఏమనకుండానే భయంగా ఆతరతగా వాళ్ల ముఖాల్లో ఛ..

ఇప్పుడు? ఇప్పుడు తను ఎక్కడ మనుషులు కలుస్తే అక్కడల్లా సాయుధ పోలీసులను పంపి చెల్లాచెదురు చేసిన ధూర్తుడు? యస్– తనకు తాను హింసించుకోలేదు. తను తనలో లోపలి




మంట చల్లారాలంటే– కాశ్మీరు లోయ, నాగా మిజో, పంజాబు, దండకారణ్యం– ఎక్కడేమిటి? ఎందరినేమిటి?

పైగా ఎన్నికల రోజులు.. తను చంపబడితే– అస్థిరత వస్తుందా? పొలిటికల్ మర్డర్– మర్డర్లు... నవ్వుకున్నాడు.

తనను చంపరు. చుట్టూ వలయంలాగా సాయుధ గార్డ్స్.

లేచి నిలబడ్డాడు.. గార్డ్సు, వెన్నెల నవ్వుతున్నాయా? "నువ్వు పిరికివాడివి, ధూర్తునివి, వేలాదిమందిని చంపితే గాని నీకు నిద్రపట్టదు"

తను పిరికివాడు కాదు. ధైర్యస్తుడు కాదు. యుద్ధంలో ధైర్యస్తుడు, పిరికివాడు చస్తారు. తను ఏదీ కానివాడు. జంతువు కాదు– మనిషి కాదు. మనిషి జంతువుల ఆపద్ధర్మ కలయికలా– ఏదో? మరేదో? తను ఆత్మహింసా కారుడా? కాదు కానే కాదు. సకల సంపదల్లోంచి వొచ్చినవాళ్ళు– రైతులు, కార్మికులు ఓడిపోతే, దగాపడితే, ఐక్యం కాకపోతే, దారితెన్నూ కానకపోతే ఆత్మహత్య చేసుకుంటారు. అది ఆత్మహింస.

మరి తను పర హింసాకారుడా? అప్పుడతనికి వెన్నెల మీద అసహ్యం కలిగింది. గాలిమీద కోపమొచ్చింది. విసుగ్గా, కోపంగా, కొంచెం హోదాగా, టకటక నడిచి...

మళ్ళీ గదిలోకొచ్చాడు. హమ్మయ్య ఊపిరి పీల్చుకున్నాడు. విసిపి ఆటోమేటిక్‌గా ఆగిపోయి వున్నది. 'మిస్టర్ పెళ్ళాం' క్యాసెట్టు అటిటు తిప్పిమాసి ఆన్‌చేశాడు.

పచార్లు చేస్తూనే ఆ సినిమా సీరియస్‌గా చూడసాగాడు. చేతులూపుతూ అటిటు తిరిగాడు. మంచి నీళ్ళు తాగాడు. ఆ కాసెట్ తీసేసి 'రాజేంద్రుడు గజేంద్రుడు' వేసి అరగంట ఊరకనే నవ్వుతూ చూశాడు.. పిచ్చి పట్టినట్టు.

సోఫాలో కూర్చుండి– సినిమాలో లీనమౌతూ... తెగిపోతూ–

రాజ్‌కపూర్ 'మేరే నామ్ జోకర్' గుర్తొచ్చింది– రాజ్‌కపూర్, నెహ్రూ, టాటా ముగ్గురి మొహాలు– ఆ మూడు ముఖాలు ఒకటేనా? ఒకే ఆత్మకు మూడు ముఖాలా? కమ్యూనిస్టులు దీన్ని దళారీ బూర్జువా ఫేసంటారేమో? ఈ సినిమాలు ఈ స్థితిలో తను ఇంత ఆసక్తిగా చూడడమేమిటి? ఇప్పుడు హీరో లవసరం లేదు. అందానీ, రాజేంద్ర– తను– చిత్రంగా వుందే.

తను ఎన్నికల్లో గెలిస్తే ఏమౌతుంది? పార్టీ గెలిస్తే ఏమౌతుంది. తనేమి చేయడు.. ఎవరిని చేమీ చెయ్యకుండా– బలాబలాలు వాళ్ళే చూసుకుంటారు. కుంభకోణాలు, స్కాముల గొడవలతో సహా– తను ఏం చేస్తాడు? మనుషులను ద్వేషిస్తో– అప్పులు, వడ్డీలు, పరిశ్రమలు, రోడ్లెక్కడ వేయాలో? తను మనుషులెక్కడ సంతోషంగా వుంటారో అక్కడ చూసుకోవాలి! మోహనుడు తిరుగుతాడు.. తను అదే నిషాలో మరికొంతకాలం బతుకుతాడు.

ఓడిపోతే ఏమౌతుంది?

అవసరం తీరినప్పుడల్లా! ఒక్కొక్క మలుపును ఆమోదించని వాళ్ళంతా నిర్దాక్షిణ్యంగా చంపబడ్డారు... తను మూటముల్లె సర్దుకున్న తనను తీసుకొచ్చి– వాళ్ళు ఆదుకున్నారు.

ఓడిపోతే మళ్ళీ తనెటు వెళ్ళాలి. ఢిల్లీ, మాయల మరాఠీల తల్లి. తను కదిపిన పావులన్నీ పాములై కరుస్తాయి. అయినా తను ఢిల్లీలో ఏమి చేయగలడు? మరెక్కడికి పోగలడు. ఎక్కడో పుట్టి– దేనికోసమో నడిచి, పరుగెత్తి ఎక్కడ తేలి...

తన కొడుకులు తన సంక్షోభాన్ని ఆసరాగా తీసుకున్నారు. తన కొడుకులు తన సంక్షోభాన్ని ఆసరాగా తీసుకున్నారు. తన లోపలి అరాచకత్వాన్ని పెద్దోడు– వాడు రానిస్తాడా? వాడి దగ్గర తనుండగలడా? తన ప్రయాణంలో కోట్ల డబ్బు– ఎన్ని కోట్లు? అవన్నీ బయటకొస్తే...

– మళ్ళీవచ్చేవారం